సాక్షి
సూర్యాపేట
బుధవారం : 13 : సెప్టెంబర్ : 2023



వైభవంగా నిత్యకల్యాణం

మట్టపల్లిలో గల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్య కల్యాణాన్ని మంగళవారం నిర్వహించారు. - 8లో



దారి దోపిడీ ముఠా అరెస్టు

దారి దోపిడీకి పాల్పడుతున్న ఐదుగురు హిజ్రాలు, ఇద్దరు యువకులను చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



విద్యుదాఘాతంతో..

విద్యుదాఘాతంతో చిలుకూరు, బీబీనగర్ మండలాల్లో ఇద్దరు రైతులు మృతి చెందారు. - 8లో

న్యూస్‌రీల్

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో సేవాభావం

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం వల్ల సేవాభావం, క్రమశిక్షణ, ఉత్తమ లక్షణాలు అలవడుతాయని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్‌ల ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరినట్లయితే అనేక ప్రయోజనాలకు కలుగుతాయన్నారు. సామాజిక సేవా దృక్పథం అలవడుతుందన్నారు. అలాగే దేశ శ్రేయస్సు కోసం ఎలా పాటుపడాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ వి.వెంకటేషులు, సుబేదార్ మేనేజర్ ఎల్.మాధవరావు, నాయక్ సుబేదార్ జగన్నాథం, సంతోష్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతకార్మికుల ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలకు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు చెల్లిస్తున్న రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని ధర్మభిక్షం భవనంలో రేగటి లింగయ్య అధ్యక్షతన నిర్వహించిన సంఘం ప్రాంతీయ సమావేంలో ఆయన మాట్లాడారు. కల్లు విక్రయించుకునే గీత కార్మికులకు వెయ్యి గజాల స్థలం కేటాయించాలన్నారు. కార్మికులకు ఉచిత వైద్యం కూడా అందించాలని ఆయన కోరారు. ప్రతి సొసైటీకి ఐదెకరాల భూమి కేటాయించి తాటి ఈత వనాలను పెంపునకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, ప్రాంతీయ అధ్యక్షుడు బండారు లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు గోపగాని రవి, పాదిల లింగయ్య పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో ఘనంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న వేద పండితులు

చివ్వెంల : వర్షాలు సమృద్ధి కురిసి పాడిపంటలు బాగా ఉండాలని కోరుతూ చివ్వెంల మండలం ఉండ్రుగొండ గిరిదుర్గంలో వెలసిన శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు క్రిష్ణమోహన్, శ్రీనివాస్, రామయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంజనీ పుత్రుడిని సిందూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం క్షేత్రపాలకుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు.

ఎస్ సార్.. అనక్కర్లేదు!

పాఠశాలల్లో విద్యార్థులకు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్

- రెండు రోజులుగా కొనసాగుతున్న ప్రక్రియ
- స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు
- హాస్టల్ విద్యార్థులకు సైతం ఇదే విధానం



విద్యార్థుల ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ తీసుకుంటున్న అధికారి

ప్రభుత్వ పాఠశాలలు	979
విద్యార్థుల సంఖ్య	52,170
హాస్టళ్లు	48

చిలుకూరు: విద్యార్థులు అటెండెన్స్ కోసం ఎస్ సార్ అనాల్సిన పనిలేదు. విద్యార్థుల హాజరుపై ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు(ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్) అమలు చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి కొనసాగుతోంది.

యాప్‌లో నమోదు

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ విధానం అమలు చేస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ఉన్నత, కస్తూర్బా పాఠశాలలతో పాటు, బీసీ, ఎస్సీ , ఎస్టీ , గురుకుల హాస్టల్స్‌లో సైతం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 979 పాఠశాలలు ఉండగా వీటిల్లో 52,170 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ప్రతి రోజు ఉపాధ్యాయులు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ తీసుకొని యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీని ద్వారా జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థుల హాజరును ఆరా తీయడానికి వీలు ఉంటుంది. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంకా పారదర్శకంగా అమలు చేయడానికి కూడా వీలు ఉంటుంది.బోగస్ విద్యార్థుల సంఖ్యను గుర్తించే అవకాశం ఉంటుంది. యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్, స్కాలర్‌షిప్ వంటివి ఎంత మందికి ఇచ్చారన్న వివరాలు వెంటనే తెలిసిపోతాయి. భవిష్యత్‌లో ఉపాధ్యాయుల కూడా ఈ విధానాన్ని అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలిసింది.

అటెండెన్స్ ఇలా..

విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ తీసుకోవడానికి ప్రభుత్వం యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను ట్యాబ్ లేదా స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్ ద్వారా విద్యార్థి కళ్లు, ముక్కు ఇలా 70 ఫేషియల్ రికగ్నైజేషన్ రిపాయింట్లు ఫీడ్ చేస్తారు. హెడ్‌మాస్టర్ గానీ క్లాస్ టీచర్‌గానీ యాప్‌ను ఓపెన్ చేసి విద్యార్థి ముఖం వైపు చూపిస్తే అటెండెన్స్ నమోదవుతుంది. ఈ సమాచారం క్షణాల్లో పైఅధికారులకు చేరుతుంది. ఎంత మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు, ఎంత శాతం మంది గైర్హాజరయ్యారో తెలిసిపోతుంది. యాప్ వినియోగంపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఇప్పటికే అవగాహన కల్పించారు.

100 శాతం అమలుకు కృషి



జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఈ నూతన విధానంపై ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం. సోమవారం, మంగళవారం రెండు రోజుల్లో 45 నుంచి 55 శాతం వరకు ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ నమోదు చేశాం. త్వరలో జిల్లాలో 100 శాతం అమలు చేస్తాం.

– శ్రావణ్‌కుమార్, జిల్లా సెక్టోరియల్ అధికారి

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

హుజూర్‌నగర్ : జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రూట్‌మ్యాప్ పక్కాగా ఉండాలని, పటిష్టమైన పోలీస్ రక్షణతో పాటు బందోబస్తు నిర్వహించాలన్నారు. పక్కా ప్రణాళికతో అధికారులు ముందుకెళ్లాలని ఆయన సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూట్‌మ్యాప్, పోలీస్ బందోబస్తు, సమస్యాత్మక కేంద్రాల నిర్వహణ, అక్రమ రవాణా నిరోధం, వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, ఎన్నికల నియమావళి అమలు తదితర అంశాలపై అధికారులతో చర్చించి వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పని చేయాలని సూచించారు. ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఆర్‌డీఓ జగదీశ్వర్ రెడ్డి, డీఎస్పీ ప్రకాష్, సీఐ రామలింగారెడ్డి, మండల రెవెన్యూ, పంచాయితీ, పోలీస్ అధికారులు, ఎన్నిక సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

సంపద వనాల పనులు త్వరగా పూర్తిచేయాలి



మునగాలలో ఏర్పాటు చేసిన సంపద వనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

మునగాల(కోదాడ): జిల్లా వ్యాప్తంగా 256 ఎకరాల్లో 115బ్లాకుల్లో ఏర్పాటు చేయనున్న సంపద వనాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. మంగళవారం మునగాల గ్రామపంచాయతీ శివారులో ఎన్‌ఎస్పీ కాలువ కట్టపై ఇటీవల ఏర్పాటు చేసిన సంపద వనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మునగాల మండలంలో 34ఎకరాల్లో సంపద వనాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా సంపద వనాల పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, ఏపీఓ శైలజ, మండల సర్వేయర్ సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ నారగాని కృష్ణవేణి ఉన్నారు.

జేఎల్‌ఎంలుగా మార్చాలి



సూర్యాపేటలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న కార్మికులు

భానుపురి (సూర్యాపేట) : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లను జేఎల్‌ఎంలుగా మార్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి మంగళవారం సూర్యాపేట పట్టణంలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను జూనియర్ లైన్‌మెన్లుగా గుర్తించాలన్నారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి రెండురోజుల పాటు జిలాల్లో దీక్షలు, ఈనెల 15వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కోటగిరి వెంకటనారాయణ, అధ్యక్షుడు చిత్తలూరి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, ఎం.ముత్యాలు, కార్మికులు కోటగిరి భాస్కర్, షేక్ జానీపాషా, సీహెచ్.సైదిరెడ్డి, గణేష్, ఎం.గోపయ్య, పుల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.



ఏపూరులో ఉత్తరప్రదేశ్ బృందం

మహిళా విభాగంలో జాతీయ స్థాయి అవార్డు గెలుచుకున్న ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు గ్రామాన్ని మంగళవారం సందర్శించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచ్‌ల బృందం

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట: రాష్ట్రంలోని ప్రభుత్వ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రైవేట్ జీఎన్‌ఎం (జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ) శిక్షణ సంస్థల్లో 2023–24 విద్యా సంవత్సరానికి జీఎన్‌ఎం ట్రైనింగ్ (3 సంవత్సరాల)కోర్సులో ప్రవేశానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలు వివరాలకు సంబంధిత ప్రిన్సిపాల్, జీఎన్‌ఎం ట్రైనింగ్ కాలేజ్, జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ కార్యాయలంలో సంప్రదించాలన్నారు. ఈ నెల 16 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సత్వర న్యాయం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, చిత్రంలో న్యాయమూర్తులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్



హుజూర్‌నగర్‌లో జిల్లా అదనపు కోర్టును ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్, చిత్రంలో జడ్జిలు, కలెక్టర్, ఎస్పీ

హుజూర్‌నగర్ : కక్షిదారులకు సత్వరన్యాయం అందించడానికి న్యాయవాదులు నిరంతరం కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో అదనపు జిల్లా కోర్టును హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వర్చువల్‌గా ప్రారంభించగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయస్థానం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని భౌతికంగా ఆవిష్కరించారు. చాంబర్, కోర్టు హాల్, కేసుల విచారణను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ హుజూర్‌నగర్ కు అదనపు జిల్లా కోర్టును మంజూరు చేయించడంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే బాధ్యతలు స్వీకరించిన తర్వాత హుజూర్ నగర్ జిల్లా అదనపు కోర్టు ప్రారంభించడం ఈ ప్రాంత వాసులకు గర్వకారణం అని అన్నారు. ఈ కోర్టు వల్ల హుజూర్‌నగర్ ప్రాంతంలోని ఏడు మండలాల ప్రజల ముంగిటకు న్యాయ సేవలు చేరినట్టైందన్నారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదులు చేసిన కృషి మరువ లేనిదన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల కేసులు రాజీ అవుతాయని భావించగా అందుకు భిన్నంగా 18 వేల కేసులను పరిష్కరింపజేసి రాష్ట్రస్థాయిలో ఏడవ స్థానంలో నిలిచామని చెప్పారు. జూనియర్ న్యాయవాదులు నిరంతర విద్యార్థిగా న్యాయ శాస్త్ర గ్రంథాలను చదువుతూ వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకొని కక్షిదారులకు మంచి సేవలు అందించాలని ఆయన కోరారు. కోదాడలో నాలుగు కోర్టుల భవనం, తుంగతుర్తిలో కోర్టు భవన నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి , సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడారు. నల్లగొండ ఎంపీ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి .. జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, అడిషనల్ ఎస్పీ మేక శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రకాష్, సీఐ రామలింగారెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎన్ఎస్ఆర్, కాల్వ శ్రీనివాసరావు, కొణిజేటి వేణు, చింతలపూడి సుధాకర్, నట్టే సత్యనారాయణ, ఏజీపీలు ఉప్పల గోపాల కృష్ణమూర్తి, అంబటి శ్రీనివాస రెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి జక్కుల నాగేశ్వరరావు, న్యాయవాదులు మహిళా న్యాయవాదులు, నియోజకవర్గంలోని ఎస్ఐలు, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కె. వెంకటరెడ్డి, పద్మ సైదేశ్వరరావు, జెడ్పీటీసీలు డాక్టర్ కొప్పుల సైదిరెడ్డి, జగన్ నాయక్, పద్మ గోవిందరెడ్డి, వివిధ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్‌కు బొకే అందజేస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అనాథలను ఆదుకోవాలని..

ఐదు మున్సిపాలిటీల్లో ఇంటింటి సర్వే

- అనాథల వివరాలు అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది
- నెలరోజులుగా సాగుతున్న ప్రక్రియ
- ఇప్పటి వరకు 184 మంది గుర్తింపు



కోదాడలో అనాథల గుర్తింపు కోసం సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోదాడ: అనాథలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తల్లిదండ్రులు లేని పిల్లల వివరాలను అన్ని మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా సేకరించడానికి అధికారులు సిబ్బందిని నియమించారు. ఇందులో మెప్మా సభ్యురాలితో పాటు మున్సిపాలిటీ సిబ్బంది ఉన్నారు. నెల రోజులుగా అనాథల వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 184 మందిని గుర్తించారు.

మున్సిపాలిటీ	గుర్తించిన అనాథలు
కోదాడ	65
సూర్యాపేట	87
హుజూర్‌నగర్	11
నేరేడుచర్ల	09
తిరుమలగిరి	12
మొత్తం	184

అనాథలు ఎవరంటే..

ఏదైనా కారణం చేత తల్లిదండ్రులను కోల్పోయిన వారిని అనాథలుగా గుర్తిస్తున్నారు. వీరు అప్పుడే పుట్టిన వారి నుంచి 23 సంవత్సరాల లోపు వయస్సున్న ఆడ, మగ పిల్లలను అనాథలుగా పరిగణిస్తారు. దీంతో పాటు తల్లిదండ్రులు మరణించి బంధువుల సంరక్షణలో ఉన్నవారిని కూడా గుర్తిస్తున్నారు. వీరు తల్లిదండ్రులు మరణించినట్లు ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. ఇలాంటి వారిని గుర్తించిన అనంతరం ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో వారి వివరాలను, ఫొటోలను అక్కడికక్కడే సిబ్బంది అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో పాటు వారు ఎవరి సంరక్షణలోనైనా ఉంటే వారి వివరాలను కూడా యాప్‌లో నమోదు చేస్తున్నారు.

184 మంది గుర్తింపు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు మున్సిపాలిటీల్లో మెప్మా, మున్సిపాలిటీ సిబ్బంది నెల రోజులుగా వార్డుల వారీగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో ఇప్పటివరకు 184 మంది అనాథలను గుర్తించి వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ఈ సర్వే పూర్తికాగా, మరికొన్ని మున్సిపాలిటీల్లో కొనసాగుతోంది. సిబ్బంది దృష్టికి రాని అనాథలుంటే వారి సంరక్షకులుగానీ, చుట్టుపక్కలవారుగానీ గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు కోరుతున్నారు. సర్వే పూర్తి అయిన తరువాత అనాథలను ప్రభుత్వ బిడ్డలుగా గుర్తించి వారికి అన్ని విధాలా సాయం చేయాలని సర్కారు నిర్ణయించినట్లు సమాచారం.

అనాథలను గుర్తించాలని మాత్రమే చెప్పారు

మున్సిపాలిటీల్లో తల్లిదండ్రులు లేని 23 సంవత్సరాల వయస్సు లోపున్న వారి వివరాలను సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వారి వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వారికి ప్రభుత్వం ఎలాంటి సాయం అందిస్తుందోనన్న విషయంలో స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కోదాడ

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

భానుపురి (సూర్యాపేట) : బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఆమోదించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. ఈ దీక్షలకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం తక్షణమే వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు నరసింహారావు, జిల్లా ప్రజానాట్యమండలి నాయకులు వేల్పుల వెంకన్న, సూరయ్య తదితరులు కూడా దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సూర్యాపేట మండల అధ్యక్షుడు తాటిపాముల నవీన్, చింతలపాటి చిన్న శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, పుట్టల మల్లేష్, దైద వెంకన్న, బొజ్జ వెంకన్న, దాసరి వెంకన్న, రేణుక, చింత వినయ్ బాబు, దాసరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి



అర్వపల్లిలో 365బీ హైవేపై రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి

అర్వపల్లి: గత వేసవిలో వడగండ్ల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం అర్వపల్లిలోని 365బీ హైవేపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వడగళ్ల వర్షాలకు జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు రూ.6 కోట్ల మేర నష్టపోయారని చెప్పారు. ఐదు నెలలు దాటినా ఇంతవరకు పరిహారం చెల్లించకపోవడం శోచనీయమన్నారు. రాస్తారోకోతో హైవేపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ఎస్ఐ అంజిరెడ్డి, ఏఓ శశిధర్‌రెడ్డి వారి వద్దకు వచ్చి మాట్లాడారు. పంటనష్టం విషయాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావునాయక్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాగానే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో చెరుకు ఏకలక్ష్మి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, వజ్జె వినయ్‌యాదవ్, శిగ వెంకన్న, బాలయ్య, కొమ్ము విజయ్, శిగ శ్రీను, ఎల్లంల అవిలయ్య, అబ్బులు, కృష్ణయ్య, కొత్తపల్లి మనోజ్, సుధాకర్, భద్రయ్య, ఖమ్మంపాటి జానయ్య, జి.యాదయ్య, అంజయ్య, సైదిరెడ్డి, మద్ది రాజయ్య, వీరారెడ్డి, ఎం. అంజయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి

చింతపల్లి: గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ బస్సులోనే మృతిచెందిన ఘటన మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని వెంకటంపేట వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం బడాయిగడ్డ గ్రామానికి చెందిన ఎస్. నా రాయణ దేవరకొండ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం విధులకు హాజరైన ఆయన దేవరకొండ డిపో బస్సులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి దేవరకొండకు వస్తుండగా చింతపల్లి మండలంలోని వెంకటంపేట వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సులోనే కుప్పకూలాడు. ప్రయాణికులు గమనించి నారాయణకు గుండెపోటు వచ్చిందని గుర్తించి దేవరకొండకు తరలిస్తుండగానే మార్గమధ్యలోనే మృతిచెందాడు. దీంతో ఆర్టీసీ అధికారులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం

పెన్‌పహాడ్: బైక్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన చిట్యాల రఘు (16) బైక్‌పై వెళ్తూ నాగులపాటి అన్నారం గ్రామానికి చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. రఘు తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నాగారం ఎంపీఓకు అవార్డు


అవార్డు అందుకుంటున్న ధార శ్రీనివాస్

నాగారం: మండల ఎంపీఓగా పనిచేస్తున్న ధార శ్రీనివాస్ సాహిత్య రంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను మంగళవారం 'ది బెస్ట్ సిటీజన్ ఆఫ్ తెలంగాణ' అవార్డును అందుకున్నారు. అర్పిత సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. అవార్డును రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాల చారి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, లక్ష్మీకాంతం అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞశర్మ, కేవీ కృష్ణకుమారి, శివనాగు, ప్రభాకర్, గనగళ్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుండాల: మండలంలోని అనంతారం గ్రామంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన వంగ మణెమ్మ దంపతులు ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించారు. భార్యాభర్తలు ఇద్దరు కలిసి ఈ నెల 7న ఇంటికి తాళం వేసి ఉప్పల్‌లో వారి పెద్ద కుమార్తె గృహప్రవేశానికి వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా దొంగలు ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించి బీరువాలోని రూ.50వేలు చోరీ చేసినట్లు గుర్తించారు. మంగళవారం బాధితురాలు పోలీసులుకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. యాకన్న తెలిపారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించినట్లు ఎస్‌ఐ వివరించారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న చౌటుప్పల్ ఏసీపీ మొగిలయ్య


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, బంగారు గొలుసు

- నిందితుల్లో ఐదుగురు హిజ్రాలు, ఇద్దరు యువకులు
- కారు, బంగారు గొలుసు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్ ఏసీపీ మొగిలయ్య

చౌటుప్పల్: దారి దోపిడీకి పాల్పడుతున్న ఐదుగురు హిజ్రాలు, ఇద్దరు యువకులను చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చౌటుప్పల్ ఏసీపీ మొగిలయ్య మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి పట్టణంలోని క్వారీ మార్కెట్‌కు చెందిన హిజ్రాలు మందాల శ్రావణి, దళాయి రజిత, నడిపుడి మాళవిక, కందిపల్లి స్వర్ణ, కర్రి పద్మ శుభకార్యాలు, పండుగల్లో డ్యాన్స్ చేయగా వచ్చే డబ్బుతో జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లో డ్యాన్స్ ఈవెంట్స్ నిర్వహించేందుకు రాజమండ్రి పట్టణంలోని భవానీపురానికి చెందిన ఫొటోగ్రాఫర్ సానబోయిన దినేష్, కొంతమూర్ బజార్‌కు చెందిన కారు డ్రైవర్ పాశ్వాన్ సాగర్‌తో కలిసి సోమవారం కారులో రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో హైవే–9 హోటల్ ఎదురుగా జాతీయ రహదారి పక్కన కారు ఆపారు. కారు డ్రైవర్ సాగర్ హైవే మీదుగా చౌటుప్పల్‌కు వెళ్తున్న లింగోజిగూడెం గ్రామానికి చెందిన ఊదరి రమేష్ అనే యువకుడి బైక్‌ను ఆపాడు. వెంటనే కారులో ఉన్న హిజ్రాలు కిందికి దిగి రమేష్ వద్దకు వెళ్లారు. రమేష్‌తో మాట్లాడుతూనే అతడి మెడలోని తులంన్నర బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన ముఠా..

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఈ ముఠా సభ్యులు ప్రయాణిస్తున్న కారును పోలీసులు పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి స్విఫ్ట్ కారు, తులంన్నర బంగారు గొలుసు, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఐదుగురు హిజ్రాలు కలిసి చౌటుప్పల్‌తో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్, రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలకే పాల్పడడంతో వారిపై ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఐదు కేసులు నమోదైనట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో చురుకుగా వ్యవహరించిన ఇన్‌చార్జి సీఐ మహేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జానయ్య, ఎస్‌ఐ యాదగిరిని ఏసీపీ అభినందించారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- కలెక్టర్ వెంకట్రావు


కృష్ణానది హైలెవల్ వంతెన వద్ద చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మఠంపల్లి : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన మట్టపల్లి వంతెనపై నుంచి వాహనదారులు అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. మండలంలోని మట్టపల్లి వద్ద కృష్ణానదిపై ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఆయన ఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని వంతెనపై 24గంటలూ నిఘా ఉంచేందుకుగాను రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, ఫారెస్ట్, జీఎస్టీ అధికారులతో కలిసి చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా అక్రమ రవాణా జరగకుండా చూడాలని, ప్రయాణికులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతీవాహనాన్ని తనిఖీ చేస్తూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతేగాక నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని కలెక్టర్, ఎస్పీ హెచ్చరించారు. వారివెంట తాహసీల్దార్ మంగా,సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐ బాలకృష్ణ తదితరులున్నారు.

వేర్వేరు చోట్ల ఉరేసుకొని ముగ్గురి బలవన్మరణం

మిర్యాలగూడ: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దామరచర్ల మండల కేంద్రంలో రైల్వే ట్రాక్ పక్కన చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రంలోని విష్ణుపురం–జాన్‌పహాడ్ రైల్వే ట్రాక్ పక్కన రైల్వే విద్యుత్ స్తంభానికి ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనా స్థలంలో దొరికిన ఆధారాల మేరకు మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బిలాహిందూపూర్‌కు చెందిన దీపక్‌కుమార్ (24)గా గుర్తించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

యాదగిరిగుట్టలో..

యాదగిరిగుట్ట: పట్టణ పరిధిలోని కొత్తగుండ్లపల్లిలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు చెందిన మైత్రి కిషోర్‌కుమార్ (24) యాదగిరి పట్టణ పరిధిలోని కొత్తగుండ్లపల్లిలో ఉన్న హైటెన్షన్ స్తంభం వద్ద ఉన్న చెట్టుకు సోమవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతుడు ఇటీవలి కాలంలో జగద్గిరిగుట్ట ప్రాంతంలో దొంగతనానికి పాల్పడ్డాడని, ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో ఆ అవమానం భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ రమేష్ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెన్‌పహాడ్‌లో..

పెన్‌పహాడ్: మద్యం తాగడం మానేయాలని భార్య ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని తంగెళ్లగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. తంగెళ్లగూడెం గ్రామానికి చెందిన రాచకొండ లింగయ్య (60)కు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. లింగయ్య భార్య రమణ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తుంది. లింగయ్య నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగడం మానేయాలని భార్య ఒత్తిడి పెంచడంతో మనస్తాపానికి గురైన లింగయ్య మంగళశారం భార్య పాఠశాలకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగయ్య కుమారుడు ఉపేందర్ ఇంటికి వచ్చేసరికి లింగయ్య ఉరేసుకొని ఉండటం చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కిందకు దించగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


సంతోష్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: అనారోగ్యంతో హోంగార్డు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన బుడిగె సంతోష్‌గౌడ్(38) యాదాద్రి కొండపై హోంగార్డుగా పనిచేస్తున్నాడు. అతడు కొంత కాలంగా అనా రోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే చికిత్స పొందుతున్నాడు. వారం క్రితం అతడి తల్లి చనిపోయింది. దీంతో సంతోష్ ఆరోగ్యం మరింత క్షీణించి మంగళవారం ఉదయం మృతిచెందాడు. వారం రోజుల వ్యవధిలో తల్లి, కుమారుడు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. సంతోష్ మృతిచెందిన విషయం తెలుసుకున్న తోటి హోంగార్డులు, క్లాస్‌మేట్స్, ఏఆర్ పోలీసులు, ఏఆర్ బాంబ్ స్క్వాడ్ సిబ్బంది కలిసి అతడి కుటుంబానికి రూ.1,04,300 ఆర్థికసాయం అందజేశారు.

పురుగు మందు తాగి యువతి ఆత్మహత్య

చిట్యాల: జీవితంపై విరక్తితో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటప మంగళవానం చిట్యాల మండలంలోని నేరడ గ్రామంలో చోటుచేసుకుంది. చిట్యాల క్రైం ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరడ గ్రామానికి చెందిన మందుగుల ఎల్లయ్య మూడో కుమార్తె గీత(22)కు వివాహం కాలేదు. గత కొంత కాలంగా మానసిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆమె జీవితంపై విరక్తితో మంగళవారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య


కట్ట సందీప్ (ఫైల్)

గరిడేపల్లి: ప్రభుత్వ ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలు.. గరిడేపల్లి మండలం యర్రగుంట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు కట్ట శంకర్, కాంతమ్మ దంపతుల కుమారుడు సందీప్(23) ఏడాది క్రితం బీటెక్ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ప్రైవేటుగా ఉపాధి లభించడం లేదని సందీప్ మనోవేదన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలోనే సందీప్ 20 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి ఉంటున్నాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు దయనీయంగా ఉండడం, తనకు ఉద్యోగం రావడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో రాత్రి సందీప్ ఇంట్లోనే ఇనుపరాడ్డుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి కాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నార్కట్‌పల్లి: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలోని గంగాదేవిగూడేనికి చెందిన మెండె మధు(24) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు ముంబైలో ఉంటారు. మధును కూడా ముంబై రావాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేయడంతో తనకు ఇష్టం లేక మనస్తాపంతో ఆదివారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని గ్రీన్ సిటీ వెంచర్‌లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి మధును కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మధును మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

తుర్కపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు.. తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన తలారి ఆంజనేయులు, మాధవి దంపతులకు కుమారుడు భార్గవ్(5) ఉన్నాడు. ఈ నెల 10న మండల కేంద్రంలోనే తమ బంధువులు మృతిచెందగా ముగ్గురు వారి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వైపు వెళ్తున్న కారు భార్గవ్‌ను ఢీకొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ భార్గవ్ మంగళవారం మృతి చెందాడు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల రాష్ట్ర కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మంచిర్యాల డిపోకు చెందిన రెంక రవి, జనరల్ సెక్రటరీగా వరంగల్ డిపోకు చెందిన వంగ రాజు, కోశాధికారిగా సిరిసిల్ల డిపోకు చెందిన రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోదాడ డిపోకు చెందిన దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా మహబూబాబాద్ డిపోకు చెందిన శ్రావణ్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా యాదగిరిగుట్ట డిపోకు చెందిన బూడిద నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట డిపో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు బూడిద నరేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర యూనియన్‌ను ఎన్నుకున్నట్లు అద్దె బస్సు డ్రైవర్ల నూతన సంఘం సభ్యులు తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలపై ఉద్యమాలు చేస్తామన్నారు.

స్వయం సమృద్ధిలో 'ఏపూరు' అద్భుతం


ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బృందానికి స్వాగతం పలుకుతున్న ఏపూరు గ్రామస్తులు, అధికారులు


గ్రామ నర్సరీ గురించి వివరిస్తున్న స్థానిక అధికారులు

- గ్రామాన్ని సందర్శించి కొనియాడిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బృందం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): స్వయం సమృద్ధి సాధించడంలో ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏపూరు గ్రామ పంచాయతీ పనితీరు అద్భుతమని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బృందం కొనియాడింది. మహిళా విభాగంలో జాతీయస్థాయి అవార్డు గెలుచుకున్న ఏపూరు గ్రామాన్ని మంగళవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు జాతీయస్థాయి అవార్డు రావడానికి ఏవిధంగా కృషి చేశారని గ్రామ పాలకవర్గాన్ని అడిగి తెలుసుకున్నారు. సంతులిత గ్రామీణ అభివృద్ధిలో భాగంగా మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, మహిళల ఆరోగ్యంపై మహిళలకు అవగాహన కల్పించినట్లు ఉత్తరప్రదేశ్ బృందానికి స్థానిక సర్పంచ్ సానబోయిన రజితాసుధాకర్ వివరించారు. అనంతరం గ్రామ వీధుల్లో తిరుగుతూ మహిళా పార్కు, అంగన్‌వాడీ కేంద్రం, మహిళా వ్యాయామశాల, చిల్డ్రన్స్ పార్కు, హెల్త్ సబ్ సెంటర్, వైకుంఠధామం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీని పరిశీలించారు. ఏటా ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ చేస్తున్నట్లు తెలుసుకొని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలోనూ పలు పథకాల అమలుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలోని బతకమ్మ ఘాట్‌లో బృందం సభ్యులు మహిళలతో కలిసి బతకమ్మ ఆడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జి. సురేష్, జిల్లా పంచాయతీ అధికారి ఎస్. యాదయ్య, మహిళా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ, డివిజనల్ పంచాయతీ అధికారి వి. సాంబిరెడ్డి, ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి ఉమా పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌కు అవార్డు రావడం గర్వకారణం


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

హాలియా: సినీనటుడు అల్లు అర్జున్‌కు జాతీయ స్థాయి ఉత్తమ చలనచిత్ర అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని అల్లు అర్జున్ మామ, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో కేసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లు అర్జున్ అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లు అర్జున్‌కు 69వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో భాగంగా జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. కేసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు, సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దవూర ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ అనుముల మండల అధ్యక్షుడు రావుల చినభిక్షం యాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబు, సర్పంచ్‌లు భాస్కర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, ఏ.శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతిలింగారెడ్డి, విజయ్ యాదవ్, కృష్ణ, ప్రసాద్, గుర్రం హనుమంతు, సంజీవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు.నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. అదే విధంగా క్షేత్రంలోని ఆలయ పాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

- చిలుకూరు మండలం చెన్నారిగూడెంలో ఒకరు
- బీబీనగర్ మండలం మాదారం గ్రామంలో మరొకరు..


భిక్షం (ఫైల్)

చిలుకూరు: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మంగళవారం చిలుకూరు మండలంలోని చెన్నారిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారిగూడెం గ్రామానికి చెందిన పుట్టపాక భిక్షం(63) రోజుమాదిరిగా మంగళవారం తమ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటారు నడవకపోవడం గమనించి.. ఫ్యూజ్ పోయిందనుకొని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి భిక్షం కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతుడి కుటుంబ సభ్యులు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీబీనగర్‌లో..

బీబీనగర్: మండలంలోని మాదారం గ్రామానికి చెందిన ఓ రైతు మంగళవారం వ్యవసాయ బావి వద్ద మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదారం గ్రామానికి చెందిన పగిడాల గోపాల్‌రెడ్డి(60) తన వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లాడు. బోరు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

సూర్యాపేటలో యువకుడు..


మహేష్ (ఫైల్)

మునగాల(కోదాడ): మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన రావులపెంట వెంకన్న, ప్రమీల దంపతుల కుమారుడు మహేష్(24) మంగళవారం సూర్యాపేట పట్టణంలో తాను అద్దెకుంటున్న గదిలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ ఐటీఐ పూర్తిచేసి సంవత్సర కాలంగా సూర్యాపేట పట్టణంలోని 36వ వార్డులో తన మిత్రుడితో కలిసి ఓ గది అద్దెకు తీసుకొని ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం మహేష్ తన గదిలో వాటర్ హీటర్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి మిత్రుడు లేచి చూసేసరికి మహేష్ అచేతనంగా పడిఉండడంతో చనిపోయినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందని మహేష్ తండ్రి వెంకన్న సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సూర్యాపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని మహేష్ మృతదేహానికి సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని శంషాబాద్ సమీపంలో గల తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలని, ఈ సభ దేశంలోనే చారిత్రాత్మక సభగా నిలిస్తుందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే సభ దేశంలో చరిత్ర సృష్టించబోతుందన్నారు. ఈ సభకు ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ, పలువురు కాంగ్రెస్ సీఎంలు, తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. దేశంలోనే అత్యధికంగా ఏవిధంగా కాంగ్రెస్ సభ్యత్వం చేశారో అదేవిధంగా ఈ సభకు కూడా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. సాగర్ ఎడమ కాలువ పరిధిలో లక్షలాది ఎకరాల పంట ఎండిపోతున్నందున సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల్లో ఇంతకన్నా తక్కువ నీరు ఉన్నా సాగుకు నీటిని అందించామని గుర్తు చేశారు. సాగునీటి కోసం ఎమ్మెల్యేలపై, ప్రభుత్వంపై రైతులు, నాయకులు వత్తిడి తేవాలన్నారు. ఆయన వెంట ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లిఖార్జున్, ఎంపీపీ భూక్యా గోపాల్, కొట్టే సైదేశ్వరరావు, శాగంరెడ్డి గోవింద రెడ్డి, సాముల శివారెడ్డి, సుబ్బారావు, గిరిబాబు, వెంకటేశ్వర్లు, చినవెంకటరెడ్డి, మంజూనాయక్, సందీప్‌రెడ్డి, మహేష్, కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.